లీకు మాఫియాను అంతం చేస్తాం: మోదీ

- **'లీకేజీ', వందేమాతరం బిల్లులకు పార్లమెంటు ఆమోదం**

దిల్లీ: విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్న పరీక్షల ప్రశ్నపత్రాల లీకు మాఫియాను తుదముట్టిస్తామని ప్రధాని నరేంద్రమోదీ పునరుద్ఘాటించారు. లీకు గ్యాంగుల ఆటకట్టించడమే కొత్త చట్టం ఉద్దేశమని స్పష్టంచేశారు. గురువారం రాత్రి పొద్దుపోయాక ఆయన ఈ మేరకు ఓ ప్రత్యేక వీడియో సందేశాన్ని ఇన్‌స్టాగ్రాంలో విడుదల చేశారు. అంతకుముందు రాజ్యసభలో విపక్ష వాకౌట్ల మధ్య.. లీకుల కట్టడి బిల్లు ఆమోదం పొందింది. ఈ బిల్లును లోక్‌సభ ఇప్పటికే ఓకే చేసిన సంగతి తెలిసిందే. వందేమాతరం బిల్లుకు కూడా గందరగోళం మధ్యే లోక్‌సభ గురువారం పచ్చజెండా ఊపింది. ఈ రెండూ రాష్ట్రపతి ఆమోదం పొందగానే చట్టరూపం దాలుస్తాయి. జాతీయ గేయం వందేమాతరాన్ని అవమానించడం ఇకపై శిక్షార్హమైన నేరం అవుతుంది. జాతీయ గీతం జనగణమనతో సమానంగా వందేమాతరాన్నీ పరిగణించాల్సిందేనని బిల్లు చెబుతోంది. ఉల్లంఘించినవారికి మూడేళ్ల వరకు జైలుశిక్ష, జరిమానా పడతాయి. మళ్లీమళ్లీ అదే నేరాన్ని చేస్తే ప్రతిసారీ కనీసం ఏడాది చొప్పున శిక్ష పడుతుంది. ఇప్పటివరకు జనగణమన విషయంలోనే ఈ శిక్షలు ఉండేవి.

రాజ్యసభలో విపక్షాల వాకౌట్..

అంతకుముందు... గురువారం రాజ్యసభలో లీకుల కట్టడి బిల్లు సందర్భంగా గందరగోళం నెలకొంది. పెల్లెట్ గన్‌లు వాడటంతోపాటు జంతర్‌మంతర్ వద్ద విద్యార్థులపై పోలీసులు క్రూరంగా వ్యవహరించిన తీరుపై సభకు వచ్చి హోంమంత్రి ప్రకటన చేయాలని విపక్షాలు పట్టుబట్టాయి. యువతను శాంతింపజేయడానికే తప్పిస్తే సమస్యను పరిష్కరించేందుకు చట్ట సవరణ ఉపయోగపడదని రాజ్యసభ విపక్షనేత మల్లికార్జున ఖర్గే విమర్శించారు. లీకేజీలకు ఆస్కారం లేకుండా పరీక్షలు ఎలా నిర్వహిస్తారనేది ప్రభుత్వం చెప్పడం లేదని.. ప్రధాని, హోంమంత్రి పార్లమెంటుకు రాకపోవడం సిగ్గుచేటని అన్నారు. అమిత్‌షా వచ్చి సమాధానం చెప్పాలన్న తమ డిమాండు నెరవేరకపోవడంతో విపక్షాలు వాకౌట్ చేశాయి. తర్వాత బిల్లును సభ ఆమోదించింది.

అయోధ్య రామాలయ విరాళాల అవకతవకలపై ఆందోళన చేస్తున్న విపక్ష ఎంపీలు

నేను అల్లానే ఆరాధిస్తా: అసదుద్దీన్

ఏఐఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ- మత స్వేచ్ఛకు రాజ్యాంగంలో ఉన్న హామీని ఈ బిల్లు ఉల్లంఘిస్తోందన్నారు. 'వందేమాతరంలో దేవతల గురించి ఉంటుంది. అది రాజ్యాంగానికి విరుద్ధం. జనగణమన ఆలపిస్తున్నప్పుడు మనకు దానిలో దేశం కనిపిస్తుంది. కానీ వందేమాతరం ఒక ప్రార్థన. నేనొక ముస్లింను.. అల్లాను మాత్రమే ఆరాధిస్తాను' అని స్పష్టంచేశారు. దేశాన్ని హిందూరాజ్యంగా మార్చడమే బిల్లు ఉద్దేశమని ఆరోపించారు. విపక్ష నిరసనల మధ్య సభను శుక్రవారానికి వాయిదా వేశారు.

పోలీసు చర్య.. అయోధ్యపై నిరసనలు

దిల్లీలో నిరసనకారులపై పోలీసులు వ్యవహరించిన తీరు, అయోధ్య రామాలయంలో విరాళాల చోరీ వంటి అంశాలపై ప్రియాంకా గాంధీ సహా విపక్ష ఎంపీలు పార్లమెంటు మకర ద్వారం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. విరాళాల చోరులు గద్దె దిగాలని, హోంమంత్రి పార్లమెంటుకు రావాలని నినదించారు. అక్కడొక విరాళాల పెట్టెను ఉంచి, దానిలో డబ్బులు వేస్తూ.. వినూత్నంగా నిరసనలు తెలిపారు.

ఉత్తరాన ఉరిమిన మేఘం

కొండగట్టు సమీపంలోని మెహర్‌బాబా కేంద్రం వద్ద జాతీయ రహదారిపై కూలిన చెట్టు

(మొదటి పేజీ తరువాయి)

గురువారం మంచిర్యాల జిల్లాలో అత్యధికంగా 16.2 సెం.మీ. వర్షపాతం నమోదైంది. ఈ జిల్లావ్యాప్తంగా కుండపోతగా పడుతున్నాయి. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్ ప్రాంతం వణికిపోతోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాల్లోనూ భారీ వానలు కురిశాయి. జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాలోని అన్ని మండలాలు తడిసి ముద్దవుతున్నాయి. వరంగల్ జిల్లాలోనూ అదే పరిస్థితి ఉంది. ఇక దక్షిణ తెలంగాణవ్యాప్తంగా రోజంతా ముసురు వానలు కొనసాగాయి.

హైదరాబాద్‌లో ట్రాఫిక్ అవస్థలు

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో తెరపినివ్వని ముసురుతో ట్రాఫిక్‌కు ఆటంకం కలిగింది. దాంతో ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలో ఐటీ సంస్థలు తమ ఉద్యోగులను వేర్వేరు సమయాల్లో ఇళ్లకు పంపాయి. నగరవ్యాప్తంగా సగటున 2.6 సెం.మీ. పైనే వర్షపాతం నమోదైంది.

మూడు జిల్లాలకు 'పసుపు' రంగు హెచ్చరికలు

ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్ జిల్లాలకు వాతావరణ శాఖ 'పసుపు' రంగు హెచ్చరికలు జారీ చేసింది. శుక్రవారం అక్కడ భారీగా, మిగిలిన జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయంది.

పొంగిన వాగులు.. జలపాతాల పరవళ్లు

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ కలెక్టరేట్, నిర్మల్, చెన్నూరు పట్టణం, ఆసిఫాబాద్, భీంపూర్: ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం తరోడ గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై వంతెన నిర్మాణంలో ఉండటంతో... తాత్కాలికంగా వేసిన లోతట్టు వంతెనపై నుంచి వరదనీరు పారి కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ఆదిలాబాద్‌లోని డైట్ కళాశాల, ఇంద్రవెల్లిలోని జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలోకి నీరు చేరడంతో విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. వాగులు పొంగిపొర్లుతుండటంతో తలమడుగు, భీంపూర్, బేల, సిరికొండ, ఇంద్రవెల్లి, ఉట్నూరు మండలాల్లోని పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. భీంపూర్ మండలంలోని కరంజి-టి గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకుంది. కుంటాల, పొచ్చర, కనకాయి, గాయత్రీ జలపాతాలు పరవళ్లు తొక్కుతున్నాయి. నిర్మల్ జిల్లాలోని కడెం, స్వర్ణ, గడ్డెన్నవాగు ప్రాజెక్టులు జలకళకు సంతరించుకున్నాయి. మంచిర్యాల జిల్లా మందమర్రిలో మూడు ఇళ్లు కూలిపోయాయి. పలుచోట్ల రోడ్లు, ఇళ్లపై చెట్లు విరిగి పడ్డాయి. కుమురంభీం జిల్లాలోని వట్టివాగు ప్రాజెక్టు నాలుగు గేట్లను, కుమురంభీం ప్రాజెక్టు ఆరు గేట్లను ఎత్తారు. కౌటాల మండలంలో తుమ్మిడిహెట్టిలో ప్రాణహిత, తాటిపల్లి సమీపంలో పెన్‌గంగా నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

★ మంచిర్యాల జిల్లా చెన్నూరులో వర్షంతోపాటు చేపలు పడ్డాయనే ప్రచారం జరిగింది. పుప్పాల హనుమాన్ వీధిలో మధ్యాహ్నం సమయంలో భారీగా చేపలు కనిపించడంతో వాటిని పట్టుకోవడానికి స్థానికులు ఎగబడ్డారు. అయితే, ఈ వీధికి సమీపంలోని గాలికుంట కాలువలో చేపలు కొట్టుకొచ్చాయని పలువురు స్పష్టంచేశారు.

పర్యాటకులు బొగతకు రావద్దు!

న్యూస్‌టుడే, వాజేడు: తెలంగాణ నయాగరాగా పేరొందిన ములుగు జిల్లాలోని బొగత వద్ద ప్రవాహం ప్రమాదకరంగా మారింది. ఈ జలపాతాన్ని చూసేందుకు అటవీశాఖ అధికారులు పర్యాటకులను అనుమతించడం లేదు.

ఆదిలాబాద్ జిల్లాలో కుంటాల జలపాతం పరవళ్లు

వివిధ ప్రాంతాల్లో నమోదైన భారీ వర్షపాతం (సెం.మీ.లలో)

జిల్లా	ప్రాంతం	వర్షపాతం
మంచిర్యాల	తపల్పూర్	16.3
జగిత్యాల	కొల్వాయి	14.9
ఆదిలాబాద్	బరంపూర్	13.1
మంచిర్యాల	హాజిపూర్	11.3
జగిత్యాల	గుళ్లకోట	11.1
జగిత్యాల	వెల్గటూర్	11.1
నిర్మల్	బుట్టాపూర్	10.8
జగిత్యాల	సారంగాపూర్	10.7
ఆదిలాబాద్	ఇచ్చోడ	10.5
ఆసిఫాబాద్	జైనూర్	10.4

చెరువును తలపిస్తున్న మంచిర్యాల జిల్లా కోటపల్లి శివారులోని పంటపొలాలు

వర్షాలపై ముందు జాగ్రత్త చర్యలు చేపట్టండి

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమీక్ష

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో మరో రెండు రోజులు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయన్న ఐఎండీ హెచ్చరికల నేపథ్యంలో అధికార యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టాలని రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లో ఆయా శాఖల అధికారులతో ఆయన టెలీకాన్ఫరెన్స్‌లో సమీక్ష నిర్వహించారు. 'వర్షాల ప్రభావం ఎక్కువగా ఉండే జిల్లాల్లో కలెక్టర్లు, పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్, విద్యుత్, నీటిపారుదల, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి. హైదరాబాద్‌లో వర్షాల కారణంగా విద్యుత్, తాగునీటి సరఫరా, ట్రాఫిక్ సమస్యలు రాకుండా హైడ్రా, జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు సమన్వయంతో వ్యవహరించాలి. నాలుగు రోజుల క్రితం వరకు రాష్ట్రంలో 30 శాతం లోటు వర్షపాతం ఉంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో సాధారణ స్థాయికి చేరుకోనుంది' అని పేర్కొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి: మంత్రి కోమటిరెడ్డి

వర్షాల నేపథ్యంలో ఈఎన్సీ నుంచి ఏఈ వరకు అందరూ పూర్తి అప్రమత్తతతో ఉండాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశించారు. సచివాలయంలో గురువారం ఆర్‌అండ్‌బీ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. "ముంపు ప్రాంతాల్లో రోడ్ల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి. కల్వర్టులు, కాజ్‌వేలు, కోతకు గురైన రోడ్ల వద్ద ప్రమాద బోర్డులు పెట్టాలి. డివిజన్ల వారీగా రోడ్లు, వంతెనలు, లో కాజ్‌వేలు, కల్వర్టుల వద్ద పరిస్థితిపై పూర్తి సమాచారం ఉండాలి. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న రోడ్లు, వంతెనల వద్ద తగు జాగ్రత్త చర్యలు చేపట్టాలి. ఇంజినీర్లు క్షేత్రస్థాయిలోనే ఉండాలి" అని మంత్రి దిశానిర్దేశం చేశారు.

కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయండి: సీఎస్ సంజయ్ జాజు

భారీ వర్షాల నేపథ్యంలో ప్రతి జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజు ఆదేశించారు. 'రైతులు వరి కాకుండా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా చూడాలి. కూరగాయలు పండిస్తే మంచి ధర ఉంటుంది. 'హరే కృష్ణ ఫౌండేషన్' ద్వారా కూడా కొనుగోలు చేయిస్తాం' అని సీఎస్ పేర్కొన్నారు. డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. 'భారీ వర్షాలు, వరదలున్న సమయంలో ప్రమాదకర పర్యాటక ప్రాంతాలకు జనం వెళ్లకుండా పోలీసులు తగు చర్యలు చేపట్టాలి. ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సహాయచర్యలకు సిద్ధంగా ఉన్నాయి' అని పేర్కొన్నారు.

★ వర్షాకాల సన్నద్ధత నేపథ్యంలో అగ్నిమాపక, విపత్తు స్పందన దళం డైరెక్టర్ జనరల్ విక్రమ్‌సింగ్‌మాన్ గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. 33 జిల్లాల అధికారులతో జరిపిన ఈ సమావేశంలో రెస్క్యూ సిబ్బంది, పడవలు, డీవాటరింగ్ పంపులు, కమ్యూనికేషన్ వ్యవస్థలు, అత్యవసర ప్రతిస్పందన వనరుల లభ్యత, కార్యాచరణపై సమీక్షించారు. వరదల సన్నద్ధతపై రాష్ట్రస్థాయిలో ఇప్పటికే నిర్వహించిన రెండు మాక్‌డ్రిల్లు ద్వారా పొందిన అనుభవాలతో పూర్తిస్థాయిలో సన్నద్ధతో ఉండాలని ఆదేశించారు.

మానవ ప్రయత్నానికి దైవశక్తి తోడవ్వాలి

వేములవాడ వరుణ యాగంలో మంత్రి తుమ్మల

వేములవాడ యాగశాలలో పూజలు చేస్తున్న పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ఈనాడు, సిరిసిల్ల; వేములవాడ, న్యూస్‌టుడే: మానవ ప్రయత్నానికి దైవశక్తి తోడైతే తలపెట్టిన ఏ కార్యక్రమమైనా దిగ్విజయంగా పూర్తవుతుందని, అందుకే వేములవాడ రాజరాజేశ్వర సన్నిధిలోని భీమేశ్వరాలయంలో వరుణ యాగం తలపెట్టామని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. మూడురోజుల పాటు నిర్వహించే వరుణ యాగ ప్రక్రియను రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌లతో కలిసి ఆయన ప్రారంభించారు. వేములవాడ, సిరిసిల్ల పట్టణాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తొలుత భీమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంత్రివర్గ సమావేశంలో పొన్నం చేసిన సూచన మేరకు దేవాదాయశాఖ వరుణ యాగాలు చేపట్టాలని నిర్ణయం తీసుకుందన్నారు. భగవంతుని కరుణతో రాష్ట్రంలో వర్షాలు కురుస్తుండటం ఆనందంగా ఉందన్నారు. తలతాకట్టు పెట్టయినా సరే రాష్ట్రంలో నేతన్నలను ఆదుకుంటామని, వారి సమస్యలను పరిష్కరిస్తామని తుమ్మల పేర్కొన్నారు. ఎమ్మెల్యేలు డా.సంజయ్, మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన పాపికొండలు విహారయాత్ర

దేవీపట్నం, న్యూస్‌టుడే: ఓవైపు తుపాను, మరోవైపు గోదావరిలో నీటి మట్టం పెరగటంతో పాపికొండలు విహారయాత్రను గురువారం నుంచి తాత్కాలికంగా నిలిపివేసినట్లు ఏపీ జలవనరులశాఖ ఏఈ భాస్కర్ తెలిపారు. ఈనేపథ్యంలో పోలవరం జిల్లా దేవీపట్నం మండలం గండిపోశమ్మ అమ్మవారి ఆలయం నుంచి వెళ్లే 15 ప్రైవేట్ బోట్లు, ఒక ఏపీటీడీసీ బోటు.. గోదావరి ఒడ్డున నిల్చిపోయాయి.

నేటి నుంచి ఇంజినీరింగ్ చివరి విడత కౌన్సెలింగ్

ఈనాడు, హైదరాబాద్: ఇంజినీరింగ్ చివరి విడత కౌన్సెలింగ్ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. రెండో విడతలో మొత్తం 80,167 మందికి బీటెక్ సీట్లు దక్కగా.. వారిలో 71,452 మంది ఆయా కళాశాలల్లో ప్రవేశాలు పొందారు. అంటే సీట్లు వచ్చినా దాదాపు 9 వేల మంది చేరలేదు. చివరి విడతకు 22,972 సీట్లు అందుబాటులో ఉన్నాయని ఎప్‌సెట్ ప్రవేశాల కమిటీ కన్వీనర్ శ్రీదేవసేన తెలిపారు. మూడో విడతలో సీట్లు రద్దు చేసుకున్నా ఇప్పటికే చెల్లించిన ఫీజు తిరిగి ఇవ్వరు.

ఇదీ మూడో విడత షెడ్యూల్..

- **జులై 31:** కొత్త అభ్యర్థులు స్లాట్ బుక్ చేసుకోవచ్చు
- **ఆగస్టు 1:** ధ్రువపత్రాల పరిశీలన
- **1, 2 తేదీలు:** వెబ్ ఆప్షన్లు ● **5 నాటికి:** సీట్ల కేటాయింపు

మధిర కళాశాలలో ప్రవేశాలు..: ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలో ఇంజినీరింగ్ కళాశాలలను ప్రభుత్వం ఇటీవల మంజూరు చేయగా.. చివరి విడత కౌన్సెలింగ్‌లో దాన్ని చేర్చనున్నారు. అంటే ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రవేశాలు జరగనున్నాయి. మూడు కోర్సులతో ఆ కళాశాలను ప్రారంభించేందుకు రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ ప్రభుత్వానికి ప్రతిపాదన పంపింది.

పీఆర్‌ఓల శిక్షణపై ముఖ్యమంత్రి దృష్టి

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేయత్నం

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతి పౌరుడికీ వేగంగా అందించాలనే దానిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. రెండున్నరేళ్లుగా ప్రజా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మరింత లోతుగా తీసుకెళ్లేందుకు ప్రజా సంబంధాల అధికారు(పీఆర్‌ఓ)ల పాత్ర కీలకమని సీఎం భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో పీఆర్‌వోల శిక్షణ, సామర్థ్య పెంపునకు ప్రాధాన్యమిస్తున్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం, మంత్రుల వద్ద పనిచేస్తున్న పీఆర్‌వోలు సమన్వయంతో ముందుకు సాగాలని ఇటీవల ఆదేశించారు. ఆరు గ్యారంటీల అమలు నుంచి రైతులు, మహిళలు, యువత, పేదల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ప్రతి కుటుంబానికీ చేరేలా నిరంతరం కృషి చేయాలని సూచించారు. ఆ దిశగా ముఖ్యమంత్రి సీపీఆర్‌వో నేతృత్వంలోని బృందం.. మంత్రుల పీఆర్‌వోలు, సోషల్ మీడియా కోఆర్డినేటర్లతో పలు దఫాలుగా సమావేశాలు నిర్వహిస్తోంది. ప్రభుత్వ కార్యక్రమాల ప్రచారంలో ఏకరీతి, వేగం, సమన్వయం ఉండేలా మార్గదర్శకాలు ఇస్తోంది. సామాజిక మాధ్యమాల వినియోగంలో అనుసరించాల్సిన విధివిధానాలపైనా సమాలోచనలు కొనసాగుతున్నాయి. సీఎం పీఆర్ బృందం, మంత్రుల సోషల్ మీడియా విభాగాల కోఆర్డినేటర్లు కలిసి కార్యాచరణ రూపొందిస్తున్నారు.

రైతుకు బోనస్ ఇవ్వాల్సి వస్తుందని కుట్ర: జగదీశ్‌రెడ్డి

హైదరాబాద్, న్యూస్‌టుడే: రైతులకు బోనస్ ఇవ్వాల్సి వస్తుందని.. వరి పండించకుండా ప్రభుత్వం కుట్రకు తెరలేపుతోందని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. నదుల నీళ్లపై రాష్ట్ర ప్రభుత్వం మూర్ఖత్వంతో వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఆయన గురువారం తెలంగాణ భవన్‌లో మాట్లాడారు. 'కర్ణాటక నుంచి వరద వస్తున్నా.. జూరాల నుంచి నీళ్లు పూర్తిస్థాయిలో ఎత్తిపోయడం లేదు. గోదావరి నీళ్లు తెలంగాణ నుంచి 200 టీఎంసీలు సముద్రంలో కలిశాయి. కరెంటు ఇస్తే పంటలు పండుతాయని 12 గంటలకు మించి కరెంటు ఇవ్వడం లేదు. కొత్తగూడెంలో 500 మెగావాట్ల కేంద్రాన్ని బంద్ పెట్టారు. యాదాద్రిలో 4 ఉంటే, రెండే నడుపుతున్నారు. సింగరేణిలో బొగ్గు కుంభకోణం చేశారు. థర్మల్ కేంద్రాలకు బొగ్గు సరిగా సరఫరా చేయడం లేదు. రైతులకు సాగునీరు, కరెంటు సరఫరాల్లో ఇబ్బందులు వచ్చి పంటలు ఎండిపోతే భారాస చూస్తూ ఊరుకోదు. ఇంజినీరింగ్ చదువుకున్న విద్యార్థులను సీఎం రేవంత్‌రెడ్డి క్రిమినల్ వెస్ట్ అనడం దుర్మార్గం. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దిల్లీ వేదికగా కాళేశ్వరంపై మరోసారి అజ్ఞానిలా మాట్లాడారు. ఎన్‌డీఎస్‌ఏ బృందం ఎస్ఎల్‌బీసీకి ఎందుకు రాలేదో ఉత్తమ్ సమాధానం చెప్పాలి' అని డిమాండ్ చేశారు.

ప్రాజెక్టులకు జలకళ

(మొదటి పేజీ తరువాయి)

నాలుగు మోటార్ల చొప్పున నడిపిస్తూ 12,600 క్యూసెక్కుల చొప్పున నీటిని ఎత్తిపోసిన అధికారులు.. గురువారం నంది పంపుహౌస్‌లో మరో మోటారును ఆన్ చేశారు. దీంతో 15,750 క్యూసెక్కుల ప్రవాహం నంది రిజర్వాయర్లోకి చేరుతోంది. అంతే ప్రవాహాన్ని సొరంగాల ద్వారా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రి పంపుహౌస్‌కు వదులుతున్నారు. గాయత్రి పంపుహౌస్‌లోనూ 5 మోటార్లతో వరదను ఎత్తిపోస్తున్నారు. వరద కాలువ ద్వారా 15,750 క్యూసెక్కుల ప్రవాహం మధ్య మానేరు జలాశయంలోకి చేరుతోంది.

■ ప్రాణహిత నదిలోనూ భారీ ప్రవాహం వస్తుండగా మేడిగడ్డ (లక్ష్మి) బ్యారేజీ నుంచి 3.31 లక్షల క్యూసెక్కులు దిగువకు వెళ్తున్నాయి. ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చే ఇంద్రావతి వరద, స్థానిక ప్రవాహాలు కలిసి జయశంకర్ భూపాపల్లి జిల్లాలోని సమ్మక్క బ్యారేజీ వద్ద 9.36 లక్షల క్యూసెక్కుల ప్రవాహం గోదావరిలో దిగువకు వెళ్తోంది. ములుగు జిల్లాలో తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని టేకులగూడెం సమీప రేగుమాకుగండిపై వరద నీరు చేరడంతో హైదరాబాద్-భూపాలపట్నం 163వ నంబరు జాతీయ రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి.

■ భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం ఉప్పొంగుతోంది. గురువారం రాత్రి 8 గంటలకు 28.70 అడుగులకు నీటి మట్టం చేరింది. ఇక్కడ 3.97 లక్షల క్యూసెక్కుల ప్రవాహం నమోదైంది. ప్రాణహిత, ఇంద్రావతి వైపు నుంచి వస్తున్న వరద సరళిని బట్టి ఇక్కడ ప్రమాద స్థాయికి నీటిమట్టం చేరుకునే వీలుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఎగువ కృష్ణా ప్రాజెక్టులైన కర్ణాటకలోని ఆలమట్టికి 83 వేల క్యూసెక్కుల వరద వస్తుండగా దిగువకు 97 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్‌కు 95 వేల క్యూసెక్కులు వస్తుండగా దిగువకు 1.09 లక్షల క్యూసెక్కులు వదులుతున్నారు. తెలంగాణలో కృష్ణా నదిపై మొదటి ప్రాజెక్టు జూరాల వద్ద గురువారం రాత్రికి 1.04 లక్షల క్యూసెక్కుల వరద నమోదవుతుండగా దిగువకు 1.09 లక్షల క్యూసెక్కులు వదులుతున్నారు. శ్రీశైలం వద్ద 1.12 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతోంది. ఈ జలాశయం నిల్వ సామర్థ్యం 215.81 టీఎంసీలు కాగా గురువారం సాయంత్రానికి నిల్వ 46.82 టీఎంసీలకు చేరింది. శ్రీశైలం వెనుక జలాల ఆధారంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో ఉన్న మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలోని మొదటి దశ పంప్‌హౌస్ నుంచి ఎల్లూరు జలాశయంలోకి 1,600 క్యూసెక్కులు ఎత్తిపోస్తున్నారు. జూరాల వెనుక జలాల ఆధారంగా నడిచే పథకాల్లోనూ ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి.

భద్రాచలం వద్ద గోదావరి వరద ఉధృతి ★ జూరాల గేట్ల నుంచి కృష్ణా నదిలోకి వరద పరవళ్లు

కన్నెపల్లి నుంచి ఎత్తిపోయకుండానే..!

- **వినియోగంలోకి రాని 'రివర్స్ పంపింగ్'..**

ఈనాడు, హైదరాబాద్: కాళేశ్వరం ఎత్తిపోతల్లోని మేడిగడ్డ బ్యారేజీ నీటిని కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి ఎత్తిపోయకుండానే ఎల్లంపల్లి నిండింది. దీంతో కాళేశ్వరం ఎత్తిపోతల ప్రధాన లక్ష్యం రివర్స్ పంపింగ్ వినియోగంలోకి రాకుండానే గోదావరి పైకి తరలుతోందని నీటిపారుదల శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో కన్నెపల్లి పంప్‌హౌస్ నడిపించి రివర్స్ పంపింగ్‌లో అన్నారం, సుందిళ్ల ద్వారా ఎల్లంపల్లికి నీటిని తరలించాలనే డిమాండ్ వినిపించింది. అయితే, మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండటంతో శ్రీపాద ఎల్లంపల్లి నిండు కుండలా మారింది. చివరికి 15 క్రెస్టు గేట్లు ఎత్తి ప్రవాహాన్ని సుందిళ్ల, అన్నారం మీదుగా తిరిగి మేడిగడ్డకే వదిలేయాల్సి వచ్చింది.

మూడు వానాకాలాల్లోనూ మూసుకొని గేట్లు..

2023 అక్టోబరులో మూడు బ్యారేజీల్లో లోపాలు వెలుగు చూశాయి. ఎన్డీఎస్ఏ సూచనల మేరకు అప్పటి నుంచి గేట్లు పూర్తిగా తెరిచే ఉంచారు. ఎగువ నుంచి వచ్చే వరద నదిలో దిగువకు వెళ్లిపోతోంది. 2024, 2025 వర్షాకాలాల్లో చుక్క నీరు కూడా నిల్వ చేయలేదు. ఈ ఏడాది ఎల్‌నినోతో నీటికి కటకట ఏర్పడింది. ప్రాణహితలో ముందుగా ప్రారంభమైన ప్రవాహాన్ని మేడిగడ్డ నుంచి రివర్స్ పంపింగ్ ద్వారా ఎల్లంపల్లికి తరలించాలని విపక్షాలు కోరినప్పటికీ ఆ పరిస్థితి రాలేదని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. మేడిగడ్డలో 93.50 మీటర్లు, అన్నారంలో 116.50 మీ., సుందిళ్లలో 126.50 మీటర్ల వద్ద నీటి మట్టం ఉంటేనే రివర్స్ పంపింగ్ సాధ్యమని ఎన్డీఎస్ఏ చెప్పిన విషయాన్ని పేర్కొంటున్నాయి. బ్యారేజీల భద్రతకు సంబంధించి ఎన్డీఎస్ఏ సూచనలను పక్కన పెట్టి నీటిని నిల్వ చేయడం సాధ్యం కాదని చెబుతున్నాయి. ప్రస్తుతం ఎగువ నుంచే దిగువకు వరద వస్తుండటంతో కాళేశ్వరం రివర్స్ పంపింగ్ విధానమే ఉపయోగపడకుండా పోయిందంటూ నీటిపారుదల వర్గాలు చెబుతున్నాయి. ఎల్లంపల్లి జలాశయానికి కడెం నది, విస్తారమైన స్థానిక పరీవాహకం నుంచి సహజసిద్ధంగా వచ్చే వరద ఆధారం. ఎగువ గోదావరి ప్రవాహాలు కూడా ప్రధానమైనవి. కానీ, ఎల్లంపల్లి నిండాలంటే ప్రతిసారీ మేడిగడ్డ వద్ద నీటిని నిల్వ చేసి కన్నెపల్లి నుంచి మూడు దశల్లో ఎత్తిపోయాల్సిందేనన్న వాదన మాత్రం తాజా వరద లెక్కల ముందు దిగదుడుపుగానే మిగిలిందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. అయితే, కాళేశ్వరం రివర్స్ ఎత్తిపోతల వ్యవస్థ ఎప్పటికీ అవసరం లేదనేది దీని అర్థం కాదని.. వర్షాభావ పరిస్థితుల్లోనే నీటిని వెనక్కి తరలించుకునేలా ఆ వ్యవస్థను రూపొందించారని పేర్కొంటున్నాయి.

IndianOil
మార్కెటింగ్ డివిజన్ తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యాలయం
సవరణ-తెలంగ